క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట : ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండంలోని తెల్దేవర్పల్లి గ్రామంలో సీతారాముల శివాలయ ఆంజనేయస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠాపన ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం రవీంద్రకుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌నాయక్, లోక్యనాయక్, పాలగొని సత్యనారాయణగౌడ్, కొండల్‌రెడ్డి, మోహన్‌కృష్ణ, బాలవర్ధిరాజు, తరి గోవర్ధన్, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల కౌలు వేలం

నిడమనూరు : మండలంలోని ముప్పారం వేంకటేశ్వర స్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయ భూముల కౌలు వేలాన్ని శివాలయ నూతన ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. గుంటిపల్లి, ముప్పారం గ్రామాల రైతులు వేలంలో పాల్గొన్నారు. వేంకటేశ్వర స్వామి ఆలయానికి ముప్పారం, గుంటిపల్లి శివార్లలో 67 ఎకరాలు, శివాలయానికి 12–10 గుంటల భూములు ఉన్నాయి. వీటిని ఏడాది కౌలుకోసం వేలం నిర్వహించగా రూ.14.9 లక్షలు పలికింది. వేంకటేశ్వరస్వామి ఆలయానికి ముప్పారం, గుంటిపల్లి గ్రామాల్లో 67ఎకరాల తరి, మెట్ట పొలాలు ఉన్నాయి. రామలింగేశ్వర ఆలయానికి 12ఎకరాల10గుంటల తరి భూమి ఉంది. భూముల కౌలు వేలాన్ని ఆలయ ఈఓ సిరికొండ నవీన్ నిర్వహించారు. వేలంలో పాల్గొనే రైతుల నుంచి నిర్దేశించిన భూమిని బిట్లు వారీ డిపాజిట్లు స్వీకరించి, వేలం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు విఠల్, యాదయ్య, రైతులు సోమవారిగూడెం ఉపేందర్, ముప్పారం, సోమవారిగూడెం రైతులు పాల్గొన్నారు.

సీఐ సతీష్‌రెడ్డికి సన్మానం



సతీష్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హాలియా : సీఐగా ప్రమోషన్ పొందిన హాలియా ఎస్ఐ సతీశ్‌రెడ్డిని యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐగా ప్రమోషన్ పొందిన సతీష్‌రెడ్డిని కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు మల్‌రెడ్డి బానుచందర్‌రెడ్డి, అనుముల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు యడవెల్లి రంజిత్, జనరల్ సెక్రటరీ సింగారపు నగేష్, సోషల్ మీడియా టీమ్ పోలే మధుసూధన్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామస్తులు

మాడుగులపల్లి : మండలంలోని పాములపాడు గ్రామానికి చెందిన చింతచర్ల లక్ష్మణ్ ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న యాతం జానకిరెడ్డి రూ.12వేలను, గ్రామానికి చెందిన పలువురు రూ.8,500ను మొత్తం రూ.20,500ను మృతుడి పిల్లలకు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందించిన వారిలో తోట సత్తిరెడ్డి, చింతకాయల సైదులు, మట్టారెడ్డి, నాగయ్య, సంతోష్, సైదులు, ఉన్నారు.

చెక్కుల పంపిణీ

అడవిదేవులపల్లి : మండలంలోని మొల్కచర్ల రైతు వేదికలో జిలకరకుంటతండా, మొల్కచర్ల గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను తహసీల్దార్ రాగ్యానాయక్ పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమకంలో పలువురు నాయకులు, అధికారులు తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్‌చెక్కులు..

వేములపల్లి : మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన పజ్జూరి రవికి రూ.33వేలు, శీలం గోపికి రూ.28,500, పురాణపు పిచ్చమ్మకు రూ.21వేలు ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి సహకారంతో మంజూరు కాగా శుక్రవారం మాజీ ఎంపీటీసీ నంద్యాల శ్రీరాంరెడ్డి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చంద్రయ్యలు లబ్ధిదారులకు అందజేశారు.

పాత తాలుకా కేంద్రానికి కొత్త శోభ

- మారుతున్న నిడమనూరు రూపురేఖలు
- రూ.9 కోట్లతో ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తి
- రూ.5.6 కోట్లతో పీహెచ్‌సీ
- మినీ రిజర్వాయర్‌గా నల్లచోట చెరువు



నిడమనూరులోని కోర్టు భవనం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నిడమనూరు : పాత తాలుకా కేంద్రమైన నిడమనూరు మండల కేంద్రానికి నూతన శోభ సంతరించుకుంది. మండల కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, న్యాయమూర్తి నివాసగృహం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాలు ప్రారంభం, నిడమనూరు మండల కేంద్రం రూపురేఖలు మారాయి. మినీ రిజర్వాయర్‌గా నల్లచోట చెరువు ప్రతిపాదించారు. నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనం, న్యాయమూర్తి నివాస భవనం దాదాపు రూ.6.5 కోట్లతో నిర్మించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.56కోట్లతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనాలు నిర్మించారు. ఇటీవల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పీహెచ్‌సీ పక్కనే న్యాయమూర్తి నివాసం, కోర్టు భవనం ఇలా ఒకే ప్రాంగణంలో ప్రభుత్వ కొత్త భవనాలు రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోర్టు కేసుల సంఖ్య, న్యాయవాదులు, పోలీసుల రాకతో స్థానిక వ్యాపారాలు ఇలా అన్ని రకాలుగా నిడమనూరుకు అభివృద్ధికి బాటలు పడున్నాయని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రిజర్వాయర్‌గా నిడమనూరు చెరువు..

మినీ రిజర్వాయర్‌గా నిడమనూరు మండలకేంద్రంలో ఉన్న నల్లచోట చెరువు మినీ రిజర్వాయర్‌గా రూపొందనుంది. తాగునీటి అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న హాలియా మున్సిపాలిటీకీ, నిడమనూరు మండల కేంద్రానికి తాగునీరు సరఫరా చేయాలని మినీ రిజర్వాయర్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నాయి. ఇటీవల మిర్యాలగూడ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి నిడమనూరు చెరువు అభివృద్ధి విషయం కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. చెరువు పలు చోట్ల కబ్జాకు గురైంది. దీంతో చెరువును పూర్తి స్థాయిలో సర్వే చేసేందుకు కలెక్టరు, పలువరు సర్వేయర్లు ఒకే రోజు వచ్చి సర్వే చేసి, హద్దులు చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ట్యాంకు బండ్‌గా ఏర్పాటుకు నిధులు మంజూరు

మిషన్ కాకతీయ పథకంలో నిడమనూరు చెరువును అభివృద్ధి చేయాలని పదేళ్ల క్రితం నిధులు మంజూరు చేసినా పనులు పూర్తికాలేదు. ప్రభుత్వాలు, అధికారులు, కాంట్రాక్టరు వైఖరితో తీవ్ర జాప్యం ఏర్పడింది. మినీ రిజర్వాయరుతోపాటు ట్యాంకుబండ్ గా చెరువు పరిసరాలు అభివృద్ధి చేయాలని పలువురు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం మార్పు..

నిడమనూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయ భవనం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మండల పరిషత్‌కు చెందిన కోర్టు భవనంలోకి మారిస్తే.. పలు ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ప్రధాన రహదారిపై ఉంటాయని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు. మార్కెట్‌లో ఉన్న వ్యవసాయాధికారి కార్యాలయం పాత మహిళా సమాఖ్య కార్యాలయంలోకి మార్పు చేస్తే ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉంటాయని కోరుతున్నారు.

సౌకర్యాలు మెరుగుపడాలి



నాలుగు దశాబ్దాలుగా నిడమనూరును చూస్తున్నా. ప్రతి ఊరు బాగుపడుతోంది. మా నిడమనూరు అభివృద్ధి చెందలేదని అందరిలో ఉంది. ఇప్పుడు కొత్త భవనాలతో సరికొత్తగా ఉంది. పలు ప్రభుత్వ కార్యాలయాలు నిడమనూరు నుంచి తరలిపోయాయి. విద్యా, వైద్యం ప్రభుత్వ సౌకర్యాలు మెరుగుపడాలి.

– ఇరుగుల వెంకట్ రెడ్డి, నిడమనూరు

ట్యాంకుబండ్ పూర్తి చేయాలి



మిషన్ కాకతీయలో నిడమనూరు చెరువు మినీ ట్యాంకుబండ్ చేయాల్సి ఉన్నా పనులు పూర్తి కాలేదు. ఇప్పటికైన ఉన్నతాధికారులు పట్టించుకొని ట్యాంక్‌బండ్, జిమ్, ఆహ్లాదానికి వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ ఇంటర్ కళాశాల, మినీ స్టేడియం వంటి వాటితో నిడమనూరు అభివృద్ధి దశగా అడుగులు వేయాలి.

– పున్నా శంకర్, నిడమనూరు

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

- దేవరకొండ ఏఎస్పీ మౌనిక



మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

డిండి : నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని దేవరకొండ ఏఎస్పీ మౌనిక హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని దాసరినెమలిపూర్ గ్రామంలో అక్రమ ఇసుక రవాణ, నకిలీ విత్తనాలు, బాల్య వివాహాలు తదితర అంశాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలించటం, నకిలీ విత్తనాలు విక్రయించటం, అమ్మాయిలకు18, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండకుండానే వివాహాలు చేయడం నేరమని తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో మండల వ్యవసాధికారుల సూచనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిండి రూరల్ సీఐ ఎస్.సురేష్, ఎస్ఐ. రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్



హాలియా : ఫర్టిలైజర్ షాపులో రికార్డులు తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారి శ్రీలక్ష్మి

హాలియా : నకిలీ విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించి రైతులను మోసం చేస్తే డీలర్లపై కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేస్తామని టాస్క్‌ఫోర్స్ అధికారి ఆర్ శ్రీలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం అనుముల మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో విత్తన స్టాకు రిజిష్టర్లు, బిల్ బుక్స్, ఇన్‌వాయిస్, లైసెన్సులు, ధరల పట్టికలు తదితర రికార్డులను పరిశీలించారు. డీలర్లు విధిగా రికార్డులు నిర్వహించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులను రైతులకు అధిక ధరలకు విక్రయించొద్దన్నారు. ఎరువులు, విత్తనాల డీలర్లు స్టాక్, బిల్ బుక్స్ సక్రమంగా నిర్వహించాలని, రైతులు రశీద్ తప్పనిసరిగా ఇవ్వాలని అనుమతి లేని మందులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

లైసెన్సు డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి

పెద్దవూర : లైసెన్సు ఉన్న డీలర్ల వద్దనే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలని టాస్క్‌ఫోర్స్ టీం దేవరకొండ ఏడీఏ శ్రీలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి దుకాణాల్లోని స్టాక్ రిజష్టర్లు, ఈపాస్ యంత్రాల పనితీరు, స్టాక్ నిల్వలను పరిశీలించి మాట్లాడారు. లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయకూడదని, నకిలీ విత్తనాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విత్తనాల కొనుగోలు రశీదులపై నంబర్, విత్తన రకం, కొనుగోలు తేదీ, డీలర్ సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డు తీసుకువచ్చిన రైతులకే ఈ–పాస్ యంత్రాల ద్వారా కాంప్లెక్స్ ఎరువులను విక్రయించాలన్నారు. ఆమె వెంట ఏఓపీ సందీప్‌కుమార్, తదితరులు ఉన్నారు.

కృత్రిమ ఎరువుల వాడకం తగ్గించాలి



హాలియా : మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీ రమ్య

హాలియా : రైతులు కృతిమ ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పాలిటెక్నిక్ కంపాసాగర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీ రమ్య, స్వాతి పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అనుముల మండలంలోని హజారిగూడెంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. . అనంతరం రైతులకు సేంద్రియ వ్యవసాయం, సాగునీటి ఆదాచేయడం, ఎరువుల యాజమాన్యం, నేల పరీక్ష చేయించడం, నాణ్యమైన విత్తనాల ఎంపిక, కొత్త రకమైన వరి వంగడాలు, పంట మార్పిడి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏడీఏ సరిత, ఏఈఓ విజయ్, టీచింగ్ అసోసియేట్ లిఖిత, పంచాయతీ సెక్రటరీ సుజాత, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

కొప్పోలులో రెవెన్యూ సదస్సు అడ్డగింత



కొప్పోలులో రెవెన్యూ సదస్సును అడ్డుకుంటున్న రైతులు

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు గ్రామంలో దేవాలయ భూముల అన్యాక్రాంతంపై సర్వే చేయడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ రెవెన్యూ సదస్సును శుక్రవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామంలోని వంద ఎకరాల దేవాలయ భూములను సర్వే చేసి హద్దు రాళ్ల పాతాలని గతంలో పలుమార్లు కోరినా కబ్జాదారులకు సహకరించేలా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపించారు. మార్చి 21న జరగాల్సిన ఆలయ భూముల సర్వేను అర్ధాంతరంగా నిలిపివేశారన్నారు. స్పందించిన దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి సోమవారం నోటీసులు జారీ చేసి వారంలో ఆలయ భూముల సర్వే మొదలు పెడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ ఐతగోని పరమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ తిరుగుడు లింగారెడ్డి ఐతగోని కృష్ణగౌడ్, గ్రామ యువకులు పోల లక్ష్మీనారాయణ కొత్త నాగరాజు, తేలుకుంట్ల రవి, పందుల రమేష్, మామిడి నరేష్, ఎడ్ల సురేష్,పోతెపల్లి నగేష్, బొమ్ము నాగరాజు, ఆవుల కుమార్, ఆవుల మహేష్ , మారపాక రామకృష్ణ , శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నిడమనూరు : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల రమేష్ సూచించారు. శుక్రవారం బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ 11ఏళ్ల మోదీ పాలన, భారత్ బలోపేతంపై ప్రజల్లోకీ తీసుకెళ్లాలని కోరారు. నూతనంగా నిడమనూరు మండల అధ్యక్షురాలిగా ఎన్నికై న పెందోటి శిరీషను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మన్నెపెల్లి కోటేశ్వరీ, నరేందర్, సైదులు, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య



మిర్యాలగూడ : బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు



హాలియా : చింతగూడెంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు



చింతపల్లి : బడిబాట గ్రామ సభలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

హాలియా : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, విద్యార్థులు స్వేచ్ఛాయుత వాతావరణంలో నేర్చుకోగలుతారని జన జ్ఞాప వేదిక నాయకులు, సామాజిక వేత్త డాక్టర్ ముఝ్వా రామారావు అన్నారు. శుక్రవారం అనుముల మండలంలోని చింతగూడెం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. గత ఏడాది పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించి నగదును అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్బిరెడ్డి వేమారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కూరాకుల రామయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మాధవి, పలు పాఠశాలల హెచ్‌ఎంలు పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని పలు గ్రామాల్లో ప్రొఫెసర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వాడపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస్, కల్లేపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ధీరావత్ బుజ్జిలింగనాయక్, జైత్రా తండాలో ఎంఈఓ ఎం.బాలాజీనాయక్‌లు బడిబాట కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరకొండ : మండల పరిధిలోని మైనంపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమి– రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి,పంచాయితీ కార్యదర్శి మాసారం అంబేడ్కర్, అంగన్‌వాడీ టీచర్ కమలమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట సందర్భంగా కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం మండల విద్యాధికారి ఆధ్వర్యంలో గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి పంచాయతీ కార్యదర్శి డాకు నాయక్, కేజీబీవీస్పెషల్ ఆఫీసర్ సరళ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు ఉదయ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేములపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని వేములపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం బి.రమేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమంలో కేజీబీవీ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ వసంతకుమారి, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, నాయకులు అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

పెద్దవూర : ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తుందని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా రూ.12.78 లక్షలతో సైన్స్ ల్యాబ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. అనంతరం బడిబాట కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మీఓ తరి రాములు, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాదగిరిగౌడ్, పాల్గొన్నారు.

ప్రయివేటు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

నాగార్జునసాగర్ : ప్రైవేట్ వద్దు ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అని ఆదర్శ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం శేషు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్‌కాలనీలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఉచిత యూనిఫాంలతో పాటు నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు.

చందంపేట : మండలంలో శుక్రవారం బడిబాట గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చందర్‌నాయక్ మాట్లాడుతూ బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని కోరారు. అంతకుముందు కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చౌదరి, చంద్రశేఖర్,కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

డిండి : చదువుకునే విద్యార్థులను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని స్థానిక జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం పాపిరెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్‌లో బడిబాట గ్రామ సభను నిర్వహించారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి విద్యార్థుల తల్లిదండ్రులు, యువజన సంఘాల నాయకులు, గ్రామస్తులు, రాజకీయ నాయకులు చొరవ చూపాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

పెద్దఅడిశర్లపల్లి : విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెలు మృతిచెందాయి. గుడిపల్లి మండలంలోని భీమనపల్లి గ్రామానికి చెందిన పిల్లి ఆంజనేయులు తన గేదెల షెడ్డులో కట్టేసి ఉన్న గేదె కొమ్ములకు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలాయి. ఈక్రమంలో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.లక్షనష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

పెద్దవూర : పెద్దవూర మండలంలోని బట్టుగూడెం గ్రామంలో శుక్రవారం చెన్ను సైదిరెడ్డి తన ఎద్దులను మేపడానికి వ్యవసాయ పొలాల్లోకి తోలుకొని వెళ్లాడు. అందులో ఒక ఎద్దు మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లగా విద్యుత్ తీగ తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ రూ.80వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు

ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడుకోవాలని సామాజికవేత్త డాక్టర్ జాడీ రాజు, విద్యావేత్త కస్తూరి ప్రభాకర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం సుందరయ్య పార్క్ నిర్వాహకుడు వెంకటేశ్వర్లును పలువురు ప్రముఖులు, సీనియర్ సిటిజన్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిత్యం పర్యావరణ పరిరక్షణకు వెంకటేశ్వర్లు కృషి చేస్తున్నందున సన్మానించినట్లు తెలిపారు. పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న పాలకుల విధానాలపై నిరసనలు వ్యక్తం చేయాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం తమ ప్రాణాలర్పిస్తున్న వాళ్ల కోసం ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బంటు వెంకటేశ్వర్లు,. సాగర్, డేగ వీటీ, మణికంఠ, తరుణ్, సింధుజ, ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు.

జయశంకర్‌ను జాతిపితగా గుర్తించాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌ను తెలంగాణ జాతిపితగా గుర్తించాలని కోరుతూ శుక్రవారం మిర్యాలగూడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శిరసనగండ్ల ఈశ్వరాచారి ఆధ్వర్యంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు మాట్లాడారు. వినతిపత్రం అందజేసిన వారిలో విశ్వబ్రహ్మణ సంఘం రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి చేర్యాల వెంకటాచారి, స్వర్ణకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యినుగుర్తి గోవర్ధనాచారి, పట్టణ కార్పెంటర్స్ యూనియన్ నాయకులు మల్లిఖార్జునాచారి, శ్రీనివాస్‌చారి, నర్సింగోజు రామాచారి, కోశాధికారి హనుమాచారి, శ్రీనివాసాచారి, బైరోజు రవీంద్రచారి, దాసోజు కాంతాచారి, పిచ్చయ్య చారి, ఉపేంద్రాచారి, శ్రీకాంత్‌చారి, బిష్మాచారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



పెద్దవూర: గర్నెకుంటలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కొండమల్లేపల్లి : భూ భారతి చట్టం అమలులో భాగంగా మండల కేంద్రంలో రెవెన్యూ సదస్సులు నాలుగో రోజు దోనియాల, వర్ధమాని గూడెంలో కొనసాగాయి. ఇందులో భాగంగా దోనియాల సదస్సులో దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులను వినియోగంచుకోవాలని సూచించారు. నాలుగో రోజు రెండు గ్రామాల్లో కలిపి 10అర్జీలు వచ్చినట్లు మండల తహశీల్దార్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులలో డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్, ఆర్ఐ శ్రీనివాస్, దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

చందంపేట : మండలంలోని రేకులగడ్డ, గాగిళ్లాపురం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ శ్రీధర్‌బాబు పాల్గొని మాట్లాడారు. రేకులగడ్డలో 54, గాగిళ్లాపురంలో 46దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గోవర్ధన్‌రెడ్డి, ఆర్ఐ హలీమ్, వెంకటయ్య, అనిల్, పద్మ, రాజు, రాందాస్, రమేష్‌నాయక్, సుతహసీల్దార్ శ్రీధర్‌బాబ ుభాష్‌నాయక్, మకట్‌లాల్, నర్సయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి

నిడమనూరు : భూ సమస్యల పరిష్కారానికి భూభారతి రైతు సదస్సులు నిర్వహిస్తున్నట్లు మార్కెట్ చైర్మన అంకతి సత్యం, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం గుంట్లిపల్లి గ్రామంలో భూభారతి సదస్సు నిర్వహించారు. సదస్సులో 54 దరఖాస్తులు రాగా, ఫౌతి–19, పీఓటీ కేసులు–24, పీఓటీ తొలగింపులు–6 విస్తీర్ణం సవరణలు–3, సాదాబైనామా–1, పెండింగ్ మ్యూటేషన్ –1 వచ్చాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు దాడి రాజిరెడ్డి, సందీప్, సైదులు, జనార్ధన్ గౌడ్, ఫయాజ్, అనిల్, రైతులు సైదాచారి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవూర : భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జె.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గర్నెకుంటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. పాసుబుక్‌లలో ఏవైనా తప్పులు ఉంటే సవరించుకోవచ్చునని, చిన్నచిన్న పొరపాట్లను సరిదిద్దుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టి గౌరారంలో రెవెన్యూ సదస్సు

డిండి : భూ సమస్యల పరిష్కారానికి మండలంలో ఏర్పాటు చేసిన గ్రామ రెవెన్యూ సదస్సులు శుక్రవారం కొనసాగాయి. ఈ సందర్భంగా మండల పరిధిలోని టి.గౌరారంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఆంజనేయయులు పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ భూమి వివరాలు, సర్వే నంబర్లు. పాస్‌పుస్తకాల్లో పేర్లు తప్పుగా ఉండటాన్ని సరి చేసుకునేందుకు రైతులు రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రేషన్ కోసం బస్తాలు క్యూ

మిర్యాలగూడ టౌన్ : రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులు కిటకిటలాడుతున్నారు. మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఒకేసారి ఇస్తుండడంతో వేలిముద్ర వేసే దగ్గర కొంత ఆలస్యమవుతోంది. బియ్యాన్ని రెండు సార్లు కాంటా వేయాల్సి వస్తుందని డీలర్లు పేర్కొంటున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని విద్యానగర్‌లో రేషన్ దుకాణం వద్ద బియ్యం కోసం బస్తాలను క్యూలో పెట్టి చెట్ల కింద సేదతీరుతున్నారు.



మిర్యాలగూడలోని విద్యానగర్‌లో రేషన్ దుకాణం వద్ద బస్తాలను క్యూలో పెట్టిన లబ్ధిదారులు